ఎల్‌నినో ప్రభావంతో
ఈ ఏడాది చలి తీవ్రత తక్కువే
ప్రకటించిన భారత వాతావరణ కేంద్రం



2

యువ వెలుగు
PRGI: TGTEL/26/A6429
E- Paper, www.yuvavelugu.com
తెలుగు దిన పత్రిక

యువ వెలుగు తెలుగు దిన పత్రికలో పని చేయుటకు
రిపోర్టర్లు కావలెను
మండలం । నియోజకవర్గం । జిల్లా
వారీగా రిపోర్టర్లు కావలెను
9908 502 602

సంపుటి : 01 సంచిక : 29 | ప్రచురణ : రంగారెడ్డి | ఎడిటర్ : పి. మహేష్ గౌడ్ | శుక్రవారం 02-10-2026 | పేజీలు : 4 ధర :- 02/-

# తెలంగాణ ఉద్యోగులు, పెన్షనర్లకు శుభవార్త

- ఉద్యోగులు, పెన్షనర్లకు డీఏ, డీఆర్ పెంచుతూ ప్రభుత్వ ఉత్తర్వులు
- 2024 నుంచి పెండింగ్‌లో ఉన్న డీఏల్లో రెండింటికి ఆమోదం
- డీఏల పెంపు వల్ల ప్రభుత్వ ఖజానాపై రూ. 2,500 కోట్ల అదనపు భారం



**హైదరాబాద్, యువ వెలుగు, అక్టోబర్ 1 :** దసరా పండుగను పురస్కరించుకుని తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. 2024 నుంచి పెండింగ్‌లో ఉన్న డీఏల్లో రెండింటికి రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. ఉద్యోగులు, పెన్షనర్లకు దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఈ బకాయిలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన ఈరోజు సమావేశమైన కేబినెట్ సానుకూల నిర్ణయం తీసుకుంది. మంత్రివర్గ సమావేశం ముగిసిన అనంతరం మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. కేబినెట్ తీసుకున్న నిర్ణయాలను వారు ఈ సందర్భంగా వివరించారు. రెండు డీఏల వల్ల ప్రభుత్వంపై సుమారు రూ. 2,500 కోట్ల అదనపు ఆర్థిక భారం పడుతుందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వెల్లడించారు. రాష్ట్రంలో విద్యుత్ వినియోగం భారీగా పెరిగినట్లు మంత్రులు పేర్కొన్నారు. నిన్న ఒక్కరోజే 19,892 మెగావాట్ల విద్యుత్ వినియోగం నమోదైనట్లు వారు వెల్లడించారు. వాతావరణ శాఖ సమాచారం ప్రకారం నిన్నటితో వర్షాకాలం ముగిసిందని, ఈ ఏడాది సగటున 17 శాతం వర్షపాతం తక్కువగా

- మిగతా 2లో..

# మా ఆస్తులు.. మీ ఆస్తులు విచారణకు సిద్ధమా?

## సీఎం రేవంత్‌కు కేటీఆర్ సవాల్!





**హైదరాబాద్, యువ వెలుగు, అక్టోబర్ 1 :** తెలంగాణ రాజకీయాల్లో ఆస్తుల వ్యవహారం మరోసారి వేడెక్కింది. సీఎం రేవంత్‌రెడ్డికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బహిరంగ సవాల్ విసిరారు. తమ కుటుంబ ఆస్తులతో పాటు రేవంత్‌రెడ్డి కుటుంబ ఆస్తులపైనా సుప్రీంకోర్టు లేదా హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని కోరారు. ఈ విచారణలో తమ తప్పు తేలితే ఎలాంటి శిక్షకైనా సిద్ధమని కేటీఆర్ ప్రకటించారు. సిరిసిల్ల పర్యటనలో సీఎం రేవంత్‌రెడ్డి తమ కుటుంబ ఆస్తులపై చేసిన ఆరోపణలకు కేటీఆర్ స్పందించారు. వ్యాపారం చేయడం తప్పా? అని ప్రశ్నించారు. తాను 2006లో హోటల్ వ్యాపారం ప్రారంభించానని చెప్పారు. ప్రస్తుతం మూడు హోటళ్లు ఉన్నాయని తెలిపారు. తన ఆస్తుల వివరాలను ఎన్నికల అఫిడవిట్లలో వెల్లడించానని పేర్కొన్నారు. సిరిసిల్లలో చేనేత కార్మికుల సమస్యలను సీఎం పట్టించుకోలేదని కేటీఆర్ విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆత్మహత్య చేసుకున్న 35 మంది చేనేత కార్మికుల కుటుంబాలకు కనీసం రూ.10

తరువాయి 2లో..

# చెక్‌పవర్‌పై ప్రభుత్వం కీలక నిర్ణయం

**హైదరాబాద్, యువ వెలుగు, అక్టోబర్ 1 :** తెలంగాణలోని గ్రామ పంచాయతీల్లో చెక్ పవర్ విషయంలో జరుగుతున్న ఘర్షణకు చెక్ పెట్టేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. గ్రామాల్లో అభివృద్ధి పనుల బిల్లుల చెల్లింపుల విషయంలో ఎదురవుతున్న జాప్యానికి చెక్ పెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక ఆదేశాలు జారీ చేసింది. సర్పంచ్, ఉప సర్పంచ్‌ల మధ్య విభేదాల కారణంగా చెక్కులపై సంతకాలు ఆలస్యం కావడం.. ఇలా జరగడం వల్ల అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులు పెండింగ్‌లో పడుతున్న పరిస్థితిని నివారించేందుకు కొత్త మార్గదర్శకాలు విడుదల చేసింది. పంచాయతీల్లో చెక్కుల చెల్లింపులు సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క ఆదేశించారు. ఈ మేరకు జిల్లా పంచాయతీ అధికారులకు (డీపీఓ) ప్రభుత్వం స్పష్టమైన సూచనలు చేసింది. కొత్త ఆదేశాల ప్రకారం.. గ్రామ పంచాయతీల్లో బిల్లుల చెల్లింపులకు సంబంధించిన చెక్కులపై ఉప సర్పంచ్ సంతకం చేయాల్సి ఉంటే.. కారణం లేకుండా వాటిని పెండింగ్‌లో పెట్టకూడదని తెలిపింది. తగిన కారణం లేకుండా ఏడు రోజులకు మించి సంతకం చేయకుండా జాప్యం చేస్తే సంబంధిత జిల్లా కలెక్టర్ దానిపై విచారణ చేపట్టాల్సి ఉంటుంది. విచారణలో

తరువాయి 2లో..

# అందరికీ తెలియజేయాల్సిన సంతోషకరమైన సమాచారం ఇది: నారా లోకేశ్



**అమరావతి, యువ వెలుగు, అక్టోబర్ 1 :** సోషల్ మీడియా వేదికగా జరిగిన ఓ మంచి ప్రయత్నం ఫలించింది. నెల్లూరు జిల్లాలో అదృశ్యమైన గొర్రెల కాపరి బాలుడు రామయ్య కథ సుఖాంతమైంది. సోషల్ మీడియాలో వైరల్ అయిన పోస్టులపై ఏపీ మంత్రి నారా లోకేశ్ తక్షణమే స్పందించారు. ఆయన ఆదేశాలతో రంగంలోకి దిగిన జిల్లా యంత్రాంగం, బాలుడిని క్షేమంగా గుర్తించి తల్లిదండ్రుల చెంతకు చేర్చింది. ఈ విషయాన్ని మంత్రి లోకేశ్ స్వయంగా వెల్లడించారు. ఇది అందరికీ అత్యవసరంగా తెలియజేయాల్సిన సంతోషకరమైన సమాచారం అని పేర్కొన్నారు. ఆ కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. గొర్రెల కాపరిగా ఉన్న రామయ్య అనే బాలుడు కనిపించడం లేదంటూ నిన్నటి నుంచి సామాజిక మాధ్యమాల్లో పోస్టులు విస్తృతంగా ప్రచారమయ్యాయి.

# బీఆర్ఎస్‌తో పొత్తు, ఖైరతాబాద్‌లో బీజేపీ పోటీపై కిషన్ రెడ్డి ఏమన్నారంటే?



**ఖైరతాబాద్, యువ వెలుగు, అక్టోబర్ 1 :** ఖైరతాబాద్‌లో బీఆర్ఎస్‌తో పొత్తు పెట్టుకునే ప్రసక్తే లేదని కేంద్ర మంత్రి, తెలంగాణ బీజేపీ నాయకుడు జి. కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. తెలంగాణ రాజకీయాల్లో ఈ పొత్తుపై జరుగుతున్న ఊహాగానాలకు ఆయన తెరదించారు. ఖైరతాబాద్ అసెంబ్లీ నియోజకవర్గంలో గత ఎన్నికల్లో స్వల్ప తేడాతో ఓటమి పాలయ్యామని, అయితే ఈసారి బీజేపీ విజయం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. రాబోయే ఎన్నికల్లో బీజేపీ ఒంటరిగానే ముందుకు వెళుతుందని స్పష్టం చేశారు. గురువారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.

తరువాయి 2లో..

# ఖైరతాబాద్ టికెట్ అడిగే హక్కు నాకుంది

## బీజేపీ సీనియర్ నేత కీలక వ్యాఖ్యలు



**ఖైరతాబాద్, యువ వెలుగు, అక్టోబర్ 1 :** ఖైరతాబాద్ అసెంబ్లీ ఉప ఎన్నిక నేపథ్యంలో బీజేపీ నేత చింతల రామచంద్రారెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. ఖైరతాబాద్ టికెట్ అడిగే హక్కు తనకు ఉందని స్పష్టం చేశారు. పార్టీ అధిష్ఠానం ఎవరిని అభ్యర్థిగా నిలబెట్టాలన్నది నిర్ణయిస్తుందని, తాను మాత్రం టికెట్ ఆశిస్తున్నానని చెప్పారు. దానం నాగేందర్ పార్టీ మారి కాంగ్రెస్ తరపున లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసిన సమయంలోనే ఆయన ఎమ్మెల్యే పదవి రద్దు కావాల్సిందని చింతల అన్నారు. దానం అనర్హత కోసం బీజేపీ న్యాయపోరాటం చేసిందని తెలిపారు. హైకోర్టుతో పాటు సుప్రీంకోర్టులోనూ పోరాడామని చెప్పారు. తమ ప్రయత్నాల ఫలితంగానే దానం నాగేందర్‌పై అనర్హత వేటు పడిందని పేర్కొన్నారు.

మిగతా 2లో

# గచ్చిబౌలి హోటల్‌లో వ్యభిచారం గుట్టురట్టు



- పోలీసుల అదుపులో విదేశీ యువతులు
- నిర్వాహకులు, విటుడితో పాటు ముగ్గురు ఉజ్బెక్ యువతులు అరెస్ట్
- విశ్వసనీయ సమాచారంతో హోటల్‌పై పోలీసుల దాడి
- నిందితుల నుంచి నగదు, మొబైల్ ఫోన్లు స్వాధీనం

2లో




# ఖైరతాబాద్ ఉపఎన్నిక నోటిఫికేషన్ ఆపండి

## హైకోర్టుకు విజయారెడ్డి.. విచారణ వాయిదా

**ఖైరతాబాద్, యువ వెలుగు, అక్టోబర్ 1 :** ఖైరతాబాద్ శాసనసభ నియోజకవర్గ ఉపఎన్నిక నోటిఫికేషన్ జారీ చేయకుండా భారత ఎన్నికల సంఘాన్ని ఆదేశించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై విచారణను తెలంగాణ హైకోర్టు మంగళవారానికి వాయిదా వేసింది. దివంగత మాజీ మంత్రి పి. జనార్దన్ రెడ్డి కుమార్తె విజయారెడ్డి ఈ మేరకు ఉన్నత న్యాయస్థానంలో లంచ్ మోషన్ పిటిషన్ దాఖలు చేశారు. విజయారెడ్డి తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ, 2024 ఎన్నికల్లో దానం నాగేందర్ విజయాన్ని సవాల్ చేస్తూ తమ క్లయింట్ దాఖలు చేసిన ఎలక్షన్ పిటిషన్ ఇంకా కోర్టులో పెండింగ్‌లో ఉందని గుర్తుచేశారు. ఆ ఎన్నికల అఫిడవిట్‌లో దానం నాగేందర్ తప్పుడు సమాచారం ఇచ్చారని ఆయన ఆరోపించారు. ఈ పాత పిటిషన్‌పై తుది తీర్పు వెలువడే వరకు ఖైరతాబాద్ ఉపఎన్నికకు నోటిఫికేషన్ జారీ చేయకుండా నిలిపివేయాలని న్యాయస్థానాన్ని అభ్యర్థించారు. వాదనలు విన్న హైకోర్టు, ఈ పిటిషన్‌పై కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయాలని ప్రతివాదులను ఆదేశించింది. అనంతరం తదుపరి విచారణను మంగళవారానికి వాయిదా వేస్తున్నట్లు వెల్లడించింది. కోర్టు తాజా నిర్ణయంతో ఖైరతాబాద్ ఉపఎన్నిక ప్రక్రియపై ప్రస్తుతానికి ఉత్కంఠ నెలకొంది.

## చరిత్రకు జీవం

# నిజాంలు నీళ్లు తాగిన బావికి హైడ్రా పునరుజ్జీవం



- పాతబస్తీలోని చారిత్రక బుమ్-రుక్న్-ఉద్-దౌలా చెరువు కింద ఉన్న పురాతన బావి
- సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలతో హైడ్రా ఆధ్వర్యంలో పునరుద్ధరణ పనులు ప్రారంభం
- నిజాంల కాలంలో ఔషధ గుణాలున్న నీటిని అందించిన బావిగా ప్రత్యేక గుర్తింపు

హైదరాబాద్ నగరం అంటే కేవలం కాంక్రీట్ జంగిల్ కాదు, అడుగడుగునా చారిత్రక వైభవానికి, సాంస్కృతిక వారసత్వానికి నిలువుటద్దం. ముఖ్యంగా పాతబస్తీ గల్లీల్లో తిరిగితే శతాబ్దాల నాటి కథలు మనల్ని పలకరిస్తాయి. అలాంటి ఓ అద్భుతమైన చారిత్రక కట్టడానికి ఇప్పుడు పునరుజ్జీవం లభిస్తోంది. శివరాంపల్లిలోని 356 ఏళ్ల నాటి బుమ్-రుక్న్-ఉద్-దౌలా చెరువును ఇటీవలే పునరుద్ధరించి నగరానికి ఓ మణిహారంగా అందించిన 'హైడ్రా', ఇప్పుడు అదే చెరువు కింద ఉన్న ఓ పురాతన ఊట బావికి ప్రాణం పోస్తోంది. నిజాం నవాబులు సైతం ఔషధ గుణాలున్నాయని భావించి ఈ బావి నీరు తాగినట్టు చరిత్ర చెబుతోంది. అంతటి విశిష్టత కలిగిన ఈ బావి, కాలగర్భంలో కలిసిపోతున్న తరుణంలో హైడ్రా దీని పునరుద్ధరణకు శ్రీకారం చుట్టింది.

**సీఎం ఆదేశాలతో వేగంగా అడుగులు**

గత మార్చి 8వ తేదీన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బుమ్-రుక్న్-ఉద్-దౌలా చెరువును ప్రారంభించి ప్రజలకు అంకితం చేశారు. ఆ సమయంలోనే చెరువుకు ఆనుకుని

తరువాయి 2లో..

# తెలంగాణ ఉద్యోగులు, పెన్షనర్లకు శుభవార్త

(మొదటి పేజీ తరువాయి)

నమోదైందని తెలిపారు. రాష్ట్రంలోని సుమారు 235 మండలాల్లో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయని, ఎల్ నినో ప్రభావంపై కేబినెట్ అత్యవసర నివేదికను సిద్ధం చేస్తోందని మంత్రులు వివరించారు. కేంద్ర ప్రభుత్వం నిబంధనలకు అనుగుణంగా 5,800 మెగావాట్ల విద్యుత్ కొనుగోలుకు టెండర్లు పిలవాలని కేబినెట్ నిర్ణయించినట్లు మంత్రులు వెల్లడించారు. వీటితో పాటు 'తెలంగాణ డిజిటల్ మీడియా అండ్ అడ్వర్టైజ్‌మెంట్ పాలసీ'కి కూడా రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపిందని వారు పేర్కొన్నారు.

# ఎల్‌నినో ప్రభావంతో ఈ ఏడాది చలి తీవ్రత తక్కువే

## ప్రకటించిన భారత వాతావరణ కేంద్రం

**న్యూఢిల్లీ, యువ వెలుగు, అక్టోబర్ 1 :** వర్షాకాలం ముగిసి నేటితో శీతాకాలం ప్రారంభమైంది. ఎల్‌నినో ప్రభావంతో ఈ ఏడాది చలి తీవ్రత తక్కువగానే ఉంటుందని భారత వాతావరణ కేంద్రం ప్రకటించింది. అక్టోబర్ నెలలో గరిష్ఠ, కనిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా నమోదయ్యే అవకాశం ఉందని తెలిపింది. అక్టోబర్ నుంచి డిసెంబర్ సీజన్‌లో వర్షపాతం సాధారణం కంటే తక్కువగా ఉండే అవకాశం ఉందని ఐఎండీ విడుదల చేసిన శీతాకాలం ఔట్‌లుక్‌లో పేర్కొంది. దేశవ్యాప్తంగా అక్టోబర్ నెలలో వర్షపాతం సాధారణం కంటే తక్కువగా ఉండే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్ర వ్యాప్తంగా ఈ ఏడాది 18 శాతం లోటు వర్షపాతం నెలకొన్నట్లు వెల్లడించింది. 14 జిల్లాల్లో సాధారణ వర్షపాతం, 19 జిల్లాల్లో లోటు వర్షపాతం నెలకొన్నట్లు తెలిపింది. అత్యధిక లోటు వర్షపాతం ఉన్న జిల్లాలుగా నల్గొండ, నిర్మల్, జోగులాంబ గద్వాల, మేడ్చల్ మల్కాజ్‌గిరి నమోదయ్యాయి. కామారెడ్డి, జగిత్యాల, మంచిర్యాల జిల్లాల్లో సాధారణం కన్నా అత్యధిక వర్షపాతం నమోదైంది.తెలంగాణపై ప్రభావం చూపేలా ఏడు అల్పపీడనాలు ఏర్పడగా అందులో ఆరు వాయుగుండాలు, మూడు తీవ్ర వాయుగుండాలుగా మారి ఈ వర్షపాతానికి కారణమయ్యాయి. జూన్ మాసంలో అల్పపీడనాలు ఏర్పడకపోవడంతో లోటు వర్షపాతానికి దారి తీసినట్లు వాతావరణ శాఖ వివరించింది. ఈసారి భారత్?లోకి నైరుతి ఆగమనం ఆలస్యమైంది. భారత వాతావరణ శాఖ మే 26న నైరుతి రుతుపవనాలు కేరళ తీరాన్ని తాకుతాయని అంచనా వేసినప్పటికీ ఆ అంచనాలన్నీ తలకిందులయ్యాయి. జూన్ 1వ తేదీన కూడా ప్రవేశించలేదు. నాలుగు రోజులు ఆలస్యంగా కేరళలోకి ప్రవేశించాయి. తెలంగాణలోకి సరైన సమయంలోనే అంటే జూన్ 8న ప్రవేశించినప్పటికీ వారం రోజుల పాటు దక్షిణ తెలంగాణ జిల్లా అయిన జోగులాంబ గద్వాల్ ప్రాంతంలోనే ఆగిపోయాయి. వారం రోజుల తరువాత మందకోడిగా ముందుకు కదిలి పదిహేను రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా విస్తరించాయి. జూన్ ఒకటి నుంచి సెప్టెంబర్ 30 వరకు ఏడు అల్పపీడనాలు ఏర్పడ్డాయి. ఈ అల్పపీడనాలు ఆరు వాయుగుండంగా మారాయి. ఈ ఆరు వాయుగుండాల్లో మూడు తీవ్ర వాయుగుండంగా రూపాంతరం చెంది రాష్ట్రంలో ఉత్తర, ఈశాన్య జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిశాయి. ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో లోటు వర్షపాతం నెలకొనగా ఇది శీతాకాలంపైనా ప్రభావం చూపుతుందని వాతావరణ శాఖ ప్రకటించిన ఔట్‌లుక్‌లో వెల్లడించింది.అక్టోబర్ మాసంలో పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే అధికంగా నమోదవుతాయని తెలిపింది. దేశ వ్యాప్తంగా అక్టోబర్ మాసంలో సాధారణం కంటే తక్కువ వర్షపాతం ఉంటుందని చెప్పింది. తెలంగాణలో అక్టోబర్ నుంచి డిసెంబర్ వరకు సాధారణం కంటే తక్కువ వర్షపాతం ఏర్పడుతుందని పేర్కొంది. ఈ తీవ్ర ఎల్‌నినో ప్రభావంతో ఈ ఏడాది చలి తీవ్రత తక్కువగా ఉండే అవకాశం ఉందని తెలిపింది.

# చెక్‌పవర్‌పై ప్రభుత్వం కీలక నిర్ణయం

(మొదటి పేజీ తరువాయి)

ఉప సర్పంచ్ ఉద్దేశపూర్వకంగానే చెక్కులపై సంతకం చేయకుండా బిల్లుల చెల్లింపులను అడ్డుకున్నట్లు తేలితే.. నిబంధనల ప్రకారం చర్యలు తీసుకునే అవకాశం ఉంటుంది. దీంతో కేవలం వ్యక్తిగత విభేదాలు, ఇతర కారణాలతో పంచాయతీ నిధుల చెల్లింపులు నిలిచిపోకుండా చూడాలని రాష్ట్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. చెక్కులపై సంతకం విషయంలో అనవసర జాప్యం కొనసాగి.. పంచాయతీ అభివృద్ధి పనులు, బిల్లుల చెల్లింపులు నిలిచిపోయే పరిస్థితి ఏర్పడితే ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. ఇలాంటి సందర్భాల్లో ఉప సర్పంచ్‌కు ఉన్న జాయింట్ చెక్ పవర్‌ను తొలగించి.. ఆయన స్థానంలో అధికారుల్లో ఒకరికి జాయింట్ చెక్ పవర్ కల్పించేలా జిల్లా కలెక్టర్లు చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. పంచాయతీ కార్యదర్శి, ఎంపీఓ లేదా ఎంపీడీవోలో ఒకరికి ఉప సర్పంచ్ స్థానంలో జాయింట్ చెక్ పవర్ ఇచ్చే అవకాశం ఉంటుంది. తద్వారా చెక్కుల చెల్లింపులు ఆగిపోకుండా పంచాయతీ నిధుల వినియోగం కొనసాగించేందుకు వీలు కలుగుతుంది. గ్రామ పంచాయతీల్లో రోడ్లు, డ్రైనేజీలు, పారిశుద్ధ్యం, తాగునీరు వంటి అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లుల చెల్లింపులు సకాలంలో జరగడం కీలకం. అయితే కొన్ని చోట్ల సర్పంచ్, ఉప సర్పంచ్‌ల మధ్య తలెత్తుతున్న విభేదాలు చెక్కులపై సంతకాల విషయంలో సమస్యలకు దారితీస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం గుర్తించింది. ఈ నేపథ్యంలోనే రేవంత్ రెడ్డి ప్రభుత్వం తాజా మార్గదర్శకాలను తీసుకొచ్చినట్లు తెలుస్తోంది. ఒకవైపు ఉప సర్పంచ్‌కు తన అభ్యంతరాలను తెలియజేసే అవకాశం ఉండేలా.. మరోవైపు కారణం లేకుండా సంతకాలు నిలిపివేసి పంచాయతీ కార్యకలాపాలను స్తంభింపజేయకుండా చర్యలు తీసుకునేలా నిబంధనలను స్పష్టం చేశారు. తాజా ఆదేశాలతో ఇకపై చెక్కులపై సంతకాల విషయంలో తలెత్తే వివాదాలను జిల్లా కలెక్టర్లు పర్యవేక్షించాల్సి ఉంటుంది. ఏడు రోజులకు మించి కారణం లేకుండా చెక్కులు పెండింగ్‌లో ఉంటే విచారణ చేపట్టి.. ఉద్దేశపూర్వక జాప్యం జరిగిందా లేదా అన్నది తేల్చాల్సి ఉంటుంది.విచారణ తర్వాత నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవడంతో పాటు.. అవసరమైన సందర్భాల్లో ప్రత్యామ్నాయ అధికారికి జాయింట్ చెక్ పవర్ అప్పగించేలా చర్యలు చేపట్టాల్సి ఉంటుంది. ప్రభుత్వ తాజా నిర్ణయంతో గ్రామ పంచాయతీల్లో బిల్లుల చెల్లింపుల ప్రక్రియ వేగవంతం కావడంతో పాటు.. చెక్ పవర్ విషయంలో తలెత్తుతున్న వివాదాలకు పరిష్కారం లభించే అవకాశం ఉంది.

# ఘనంగా ప్రారంభమైన CMR షాపింగ్ మాల్ నూతన షోరూమ్

## కుటుంబ సభ్యులందరికీ విస్తృతమైన వస్త్ర, ఫ్యాషన్ కలెక్షన్లు

## మీనాక్షి చౌదరి చేతుల మీదుగా ప్రారంభం..

## ప్రత్యేక ప్రారంభ ఆఫర్లు



**హైదరాబాద్, యువ వెలుగు, అక్టోబర్ 1 :** నాణ్యమైన ఉత్పత్తులు, విస్తృతమైన కలెక్షన్లు, వినియోగదారుల సంతృప్తికి ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగుతున్న CMR షాపింగ్ మాల్ వనస్థలిపురంలో తన నూతన షోరూమ్‌ను ఘనంగా ప్రారంభించింది. ఈ కొత్త షోరూమ్‌తో వనస్థలిపురం, పరిసర ప్రాంతాల ప్రజలకు సరికొత్త షాపింగ్ అనుభూతి అందుబాటులోకి వచ్చింది.

సినీ నటి మీనాక్షి చౌదరి ముఖ్య అతిథిగా హాజరై నూతన షోరూమ్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో CMR గ్రూప్ చైర్మన్ మావూరి వెంకట రమణ, డైరెక్టర్ మావూరి బాలాజీ పాల్గొన్నారు.

మాజీ ఎంపీ మధు యాష్కీ గౌడ్, TSRDC చైర్మన్ మల్లారెడ్డి రెడ్డి, ఎల్‌బీనగర్ బీజేపీ ఇన్‌చార్జి సామ రంగారెడ్డి, మాజీ కార్పొరేటర్ కొప్పుల నరసింహారెడ్డి, మాజీ కౌన్సిలర్, యాదగిరిగుట్ట బోర్డు సభ్యురాలు పీ. ఈశ్వరమ్మ యాదవ్, ఫోరం యజమాని పీ. కృష్ణ యాదవ్, సురేష్ యాదవ్ తదితరులు ప్రారంభోత్సవానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్వహించిన విలేకరుల సమావేశంలో మీనాక్షి చౌదరి మాట్లాడుతూ.. జవీ= షాపింగ్ మాల్‌లోని విస్తృతమైన చీరల కలెక్షన్లు తనను ఆకట్టుకున్నాయని తెలిపారు. అందుబాటులో ఉన్న విభిన్న డిజైన్లు, వస్త్ర కలెక్షన్లను ఆమె అభినందించారు. వనస్థలిపురం ప్రజలతో తనకు ప్రత్యేక అనుబంధం ఉందని, నూతన షోరూమ్ ప్రారంభోత్సవంలో భాగస్వామ్యం కావడం ఆనందంగా ఉందని చెప్పారు.

నూతనంగా ప్రారంభమైన షోరూమ్‌లో చీరలు, సంప్రదాయ దుస్తులు, పురుషులు, మహిళలు, చిన్నారుల వస్త్రాలతో పాటు వివిధ రకాల ఫ్యాషన్, జీవనశైలి ఉత్పత్తులు అందుబాటులో ఉన్నాయి. అన్ని వయసుల వారికి, కుటుంబ సభ్యుల అవసరాలకు అనుగుణంగా విస్తృతమైన కలెక్షన్లను అందుబాటులో ఉంచినట్లు యాజమాన్యం తెలిపింది. CMR గ్రూప్ చైర్మన్ మావూరి వెంకట రమణ మాట్లాడుతూ.. నాణ్యమైన ఉత్పత్తులను అందుబాటు ధరల్లో అందించడంతో పాటు వినియోగదారులకు సౌకర్యవంతమైన, ఆహ్లాదకరమైన షాపింగ్ అనుభూతిని అందించడమే తమ లక్ష్యమని తెలిపారు. వినియోగదారుల ఆదరణకు అనుగుణంగా తమ సంస్థను మరిన్ని ప్రాంతాలకు విస్తరించనున్నట్లు చెప్పారు.

ప్రారంభోత్సవ వేడుకల్లో భాగంగా CMR షాపింగ్ మాల్ పలు ప్రత్యేక ఆఫర్లను ప్రకటించింది. ఇందులో భాగంగా ప్రింటెడ్ చీరలు కేవలం రూ.89కే అందించడంతో పాటు మరిన్ని ఆకర్షణీయమైన ఆఫర్లు అందుబాటులో ఉన్నాయని యాజమాన్యం తెలిపింది.

వనస్థలిపురం, పరిసర ప్రాంతాల ప్రజలు నూతన CMR షాపింగ్ మాల్‌ను సందర్శించి విస్తృతమైన కలెక్షన్లను ఆస్వాదించాలని యాజమాన్యం కోరింది.

# గచ్చిబౌలి హోటల్‌లో వ్యభిచారం గుట్టురట్టు

## పోలీసుల అదుపులో విదేశీ యువతులు



**హైదరాబాద్, యువ వెలుగు, అక్టోబర్ 1 :** హైదరాబాద్ గచ్చిబౌలిలోని ఓ హోటల్‌ను కేంద్రంగా చేసుకుని విదేశీ యువతులతో వ్యభిచారం నిర్వహిస్తున్న ముఠాను పోలీసులు పట్టుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు గచ్చిబౌలి పోలీసులు గత రాత్రి ఆ హోటల్‌పై దాడి చేసి, నిర్వాహకులతో పాటు ఉజ్బెకిస్థాన్‌కు చెందిన ముగ్గురు యువతులను అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, ఢిల్లీకి చెందిన నిఖిల్ ప్రధాన నిర్వాహకుడిగా వ్యవహరిస్తూ, రామ్మోహన్ రెడ్డి అనే వ్యక్తితో కలిసి ఈ అసాంఘిక కార్యకలాపాలను నిర్వహిస్తున్నాడు. పక్కా సమాచారంతో పోలీసులు హోటల్‌పై మెరుపు దాడి నిర్వహించి, నిర్వాహకులు నిఖిల్, రామ్మోహన్ రెడ్డితో పాటు విటుడు హర్షిత్ సింఘానియాను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఉజ్బెకిస్థాన్‌కు చెందిన ముగ్గురు యువతులను కూడా అదుపులోకి తీసుకున్నారు. ఘటనా స్థలం నుంచి పోలీసులు రూ. 13,000 నగదు, రెండు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. విచారణలో పట్టుబడిన యువతుల పాస్‌పోర్టులు, వీసాలు చెల్లుబాటులోనే ఉన్నాయని, వారు కొద్ది రోజుల క్రితమే నగరానికి వచ్చినట్లు తేలింది. ఈ ఘటనపై గచ్చిబౌలి పోలీసులు కేసు నమోదు చేసి, ఈ ముఠా వెనుక ఇంకా ఎవరైనా ఉన్నారా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు.

# విచారణకు సిద్ధమా?

(మొదటి పేజీ తరువాయి)

లక్షల పరిహారం ప్రకటిస్తారని ఆశించామని చెప్పారు. అయితే సీఎం తన పర్యటనలో రాజకీయ విమర్శలకే పరిమితమయ్యారని ఆరోపించారు.ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలుపై ప్రశ్నిస్తున్నందుకే తమ కుటుంబంపై ఆరోపణలు చేస్తున్నారని కేటీఆర్ అన్నారు. ప్రజల దృష్టిని మళ్లించేందుకే ప్రభుత్వం ఇలాంటి రాజకీయాలు చేస్తోందని విమర్శించారు.

ఇక హామీలు అమలు చేసే వరకు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూనే ఉంటామని కేటీఆర్ స్పష్టం చేశారు. ప్రజా సమస్యలపై పోరాటం కొనసాగిస్తామని చెప్పారు.

# యూట్యూబర్ రావణ్‌కు షాక్

## దర్యాప్తు గడువు మరో 30 రోజుల పొడిగింపు

**హైదరాబాద్, యువ వెలుగు, అక్టోబర్ 1 :** యూట్యూబర్ రావణ్‌పై చట్టవ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం (ఉపా) కింద నమోదైన కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసు దర్యాప్తు గడువును మరో 30 రోజుల పాటు పొడిగిస్తూ కృష్ణా జిల్లా కోర్టు ఈరోజు కీలక ఉత్తర్వులు జారీ చేసింది. వివరాల్లోకి వెళితే, ప్రశ్న రావణ్‌పై నమోదైన ఉపా కేసులో చట్ట ప్రకారం నిర్దేశించిన 90 రోజుల దర్యాప్తు గడువు రేపటితో (అక్టోబర్ 2) ముగియనుంది. ఈ నేపథ్యంలో, కేసులో మరింత లోతైన విచారణ జరిపి, కీలక ఆధారాలు సేకరించేందుకు అదనపు సమయం అవసరమని దర్యాప్తు అధికారులు భావించారు. ఈ మేరకు గడువును పొడిగించాలని కోరుతూ కృష్ణా జిల్లా కోర్టులో ప్రత్యేక పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌ను పరిశీలించిన న్యాయస్థానం, దర్యాప్తు అధికారుల విజ్ఞప్తిని అంగీకరించింది.

# ఖైరతాబాద్ టికెట్ అడిగే హక్కు నాకుంది

(మొదటి పేజీ తరువాయి)

దానం నాగేందర్ ఖైరతాబాద్ నుంచి బీఆర్ఎస్ టికెట్‌పై 2023లో ఎమ్మెల్యేగా గెలిచిన విషయం తెలిసిందే. ఆ తర్వాత 2024 లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా సికింద్రాబాద్ నుంచి పోటీ చేశారు. ఈ వ్యవహారంపై దాఖలైన పిటిషన్లను విచారించిన తెలంగాణ హైకోర్టు ఆయనను అనర్హుడిగా ప్రకటించింది. సుప్రీంకోర్టు కూడా హైకోర్టు తీర్పులో జోక్యం చేసుకునేందుకు నిరాకరించింది. దీంతో ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానం ఖాళీ అయింది. ఇదే సమయంలో ఖైరతాబాద్ ఉప ఎన్నికపై బీజేపీలో టికెట్ ఆశిస్తున్న నేతల సంఖ్య పెరుగుతోంది. చింతల రామచంద్రారెడ్డి గతంలో ఖైరతాబాద్ నుంచి ప్రాతినిధ్యం వహించారు. తాజాగా ఆయన చేసిన వ్యాఖ్యలు టికెట్ రేసుపై ఆసక్తిని పెంచాయి. అయితే అభ్యర్థి ఎంపికపై తుది నిర్ణయం పార్టీ నాయకత్వమే తీసుకుంటుందని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్రంలో బీజేపీ ఎనిమిది లోక్‌సభ స్థానాలు గెలిచిందని చింతల గుర్తుచేశారు. గ్రాడ్యుయేట్, టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ పార్టీ విజయం సాధించిందన్నారు. ఖైరతాబాద్‌లోనూ బీజేపీ గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. తాను ఇప్పటివరకు ఖైరతాబాద్‌ను వదిలి ఎక్కడికీ వెళ్లలేదని, పార్టీ అవకాశం ఇస్తే బరిలోకి దిగుతానని చెప్పారు.

# బీఆర్ఎస్‌తో పొత్తు, ఖైరతాబాద్‌లో బీజేపీ పోటీపై కిషన్ రెడ్డి ఏమన్నారంటే?

(మొదటి పేజీ తరువాయి)

తెలంగాణలోని ప్రాజెక్టులకు కేంద్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో సహకరిస్తోందని కిషన్ రెడ్డి తెలిపారు. ముఖ్యంగా యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌కు బొగ్గు కేటాయింపులపై సానుకూల నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. అయితే, సింగరేణి బొగ్గును వినియోగించుకునేలా ఈ ప్లాంట్‌కు ఎందుకు రూపకల్పన చేయలేదో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మాజీ సీఎం కేసీఆర్ ప్రజలకు సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ వైఖరిని కిషన్ రెడ్డి తీవ్రంగా ఎండగట్టారు. రాహుల్ గాంధీ రాజ్యాంగబద్ధమైన సంస్థలపై, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్‌పై అనుచిత విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. దేశంలో మార్పు అనేది ప్రజల నిర్ణయంపై ఆధారపడి ఉంటుందే తప్ప, రాహుల్ గాంధీ వల్ల సాధ్యం కాదన్నారు. శివుడు, రాముడిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు హిందువుల మనోభావాలను దెబ్బతీశాయని, వాటిని బీజేపీ తీవ్రంగా ఖండిస్తోందని పేర్కొన్నారు.

ఓటమి భయంతోనే కాంగ్రెస్ సహా ఇతర విపక్షాలు కేంద్ర ఎన్నికల సంఘంపై, బీజేపీపై అసత్య ఆరోపణలు చేస్తున్నాయని కిషన్ రెడ్డి విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ ప్రాంతాల వారీగా ప్రజల మధ్య చిచ్చుపెడుతోందని, తొలగించిన ఓట్లను (మరణించిన వారు, అక్రమ చొరబాటుదారులు) తిరిగి ఓటర్ల జాబితాలో చేర్పించేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ఖైరతాబాద్‌లో బీజేపీ గెలుపు తథ్యమని, తమ పార్టీ ఓట్లను దొంగిలించదని, కేవలం ప్రజల హృదయాలను గెలుచుకుంటుందని ఆయన వ్యాఖ్యానించారు.

# ఏపీలో SIR గడువు పొడిగింపు

# అధికారులకు కీలక ఆదేశాలు

## అక్టోబర్ 10 వరకు అభ్యంతరాలు, ఫిర్యాదుల పరిష్కారం

## అక్టోబర్ 16న తుది ఓటర్ల జాబితా ప్రచురణ

## అర్హులైన ఏ ఒక్క ఓటరు మిగిలిపోకూడదనే ఈ నిర్ణయం

## కొత్త తేదీలపై విస్తృత ప్రచారం చేయాలని అధికారులకు ఆదేశం

**అమరావతి, యువ వెలుగు, అక్టోబర్ 1 :** ఆంధ్రప్రదేశ్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (సర్) కార్యక్రమ గడువును భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) మరోసారి పొడిగించింది. తాజా ఉత్తర్వుల ప్రకారం, తుది ఓటర్ల జాబితాను 2026 అక్టోబర్ 16న ప్రచురించనున్నారు. గతంలో ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ఈ ప్రక్రియ అక్టోబర్ 9న పూర్తి కావాల్సి ఉండగా, తాజాగా మరో వారం పాటు గడువు పెంచడం గమనార్హం. కొత్త షెడ్యూల్ ప్రకారం, ఓటర్ల జాబితాపై అందిన అభ్యంతరాలు, ఫిర్యాదుల పరిష్కార గడువును అక్టోబర్ 10 వరకు పొడిగించారు. ఈ గడువులోగా వచ్చిన అన్ని దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించాలని అధికారులను ఈసీ ఆదేశించింది. పెండింగ్‌లో ఉన్న విచారణలు (హియరింగ్‌లు), ముఖ్యంగా నో-మ్యాపింగ్, లాజికల్ డిస్క్రిపెన్సీ కేసులు, ఫారం 6, 7, 8 దరఖాస్తులను పూర్తిస్థాయిలో పరిష్కరించేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. అర్హులైన ఏ ఒక్క ఓటరు కూడా జాబితాలో నమోదు కాకుండా మిగిలిపోకూడదనే లక్ష్యంతో ఈ పొడిగింపు ఇచ్చినట్లు పేర్కొంది. కాగా, 2026 జులై 31న ముసాయిదా ఓటర్ల జాబితాను ప్రచురించిన విషయం తెలిసిందే. మారిన తేదీల వివరాలను గుర్తింపు పొందిన అన్ని రాజకీయ పార్టీలకు లిఖితపూర్వకంగా తెలియజేయాలని, మీడియా ద్వారా ప్రజలకు విస్తృతంగా ప్రచారం కల్పించాలని ఈసీ అధికారులను సూచించింది. ఆంధ్రప్రదేశ్‌తో పాటు మేఘాలయ వంటి ఇతర రాష్ట్రాల్లో కూడా ఓటర్ల జాబితా సవరణ గడువును కేంద్ర ఎన్నికల సంఘం పొడిగించింది.

# చరిత్రకు జీవం

(మొదటి పేజీ తరువాయి)

ఉన్న ఈ చారిత్రక బావి ప్రాముఖ్యతను హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ సీఎం దృష్టికి తీసుకెళ్లారు. దీని చారిత్రక నేపథ్యాన్ని తెలుసుకున్న ముఖ్యమంత్రి, తక్షణమే బావిని పునరుద్ధరించాలని ఆదేశించారు. దీంతో హైడ్రా అధికారులు రంగంలోకి దిగారు. చెరువు అభివృద్ధి పనులను విజయవంతంగా పర్యవేక్షించిన 'విమోస్ టెక్నోక్రాట్స్' సంస్థకే ఈ బావి పునర్నిర్మాణ బాధ్యతలను కూడా అప్పగించారు. ప్రస్తుతం పనులు శరవేగంగా జరుగుతుండగా, మరో రెండు, మూడు నెలల్లో ఈ బావి పూర్వ వైభవాన్ని సంతరించుకోనుంది.

### ఘనమైన చరిత్ర.. మరుగునపడిన వైభవం

ఒకప్పుడు వంద ఎకరాల్లో విస్తరించిన బుమ్-రుక్న్-ఉద్-దౌలా చెరువు, కాలక్రమేణా కబ్జాలకు గురై కేవలం 4 ఎకరాలకు పరిమితమైంది. దీనిపై దృష్టి సారించిన హైడ్రా, హెచ్‌ఎండీఏ లెక్కల ప్రకారం 17 ఎకరాల భూమిని ఆక్రమణల నుంచి విడిపించి చెరువుకు జీవం పోసింది. ఈ చెరువు కింద 1.50 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఊట బావికి కూడా అంతే ఘనమైన చరిత్ర ఉంది. మూడవ నిజాం సికందర్ జా పాలనలో (సుమారు 1770) ప్రధానమంత్రిగా ఉన్న నవాబ్ రుక్న్-ఉద్-దౌలా పేరు మీదుగా ఈ చెరువును నిర్మించినట్లు చారిత్రక ఆధారాలున్నాయి. చెరువు పరిసరాల్లోని ఔషధ మొక్కల వేర్ల నుంచి ప్రవహించే నీరు, సహజ సిద్ధంగా వడపోతకు గురై ఈ బావిలోకి చేరేదని, అందువల్ల ఈ నీటికి అద్భుతమైన ఔషధ గుణాలుండేవని చరిత్రకారులు చెబుతారు. ఈ స్వచ్ఛమైన నీటిని నిజాం పాలకులు తాగేవారని, ఎడ్ల బండ్లపై సుదూర ప్రాంతాలకు, చివరకు లండన్‌కు కూడా తరలించినట్లు కథలు ప్రచారంలో ఉన్నాయి. కానీ కాలక్రమేణా ఈ బావి ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్త, మట్టితో నిండిపోయి తన నీటి నిల్వ సామర్థ్యాన్ని పూర్తిగా కోల్పోయింది.

### వారసత్వ సంపద పరిరక్షణే లక్ష్యం

హైడ్రా ఈ బావి పునరుద్ధరణను కేవలం ఒక కట్టడాన్ని బాగుచేయడంగా కాకుండా వారసత్వ పరిరక్షణ, పర్యావరణ అభివృద్ధి, ప్రజా ప్రయోజనం అనే మూడు అంశాల సమన్వయంగా భావిస్తోంది. నిర్లక్ష్యానికి గురైన ఈ చారిత్రక సంపదను తిరిగి ప్రజలకు అందించి, భవిష్యత్ తరాలకు నగర జల నిర్వహణ పద్ధతులపై అవగాహన కల్పించడమే తమ లక్ష్యమని హైడ్రా అధికారులు తెలిపారు. బుమ్-రుక్న్-ఉద్-దౌలా చెరువు, దాని కింద ఉన్న ఔషధ గుణాల బావి.. ఇవి హైదరాబాద్‌లోని ప్రకృతి ఆధారిత వైద్య విధానాలకు, నీటి సంరక్షణ జ్ఞానానికి నిలువెత్తు సాక్ష్యాలు. ఈ పునరుద్ధరణతో ఆనాటి వైభవాన్ని కళ్లకు కట్టినట్లు చూపించే ప్రయత్నం జరుగుతోంది.

# విజయ పాల ఉత్పత్తి దారుల సహకార సంఘం నూతన అధ్యక్షుడిగా మహ్మద్ గులాం రసూల్ నియామకం



**జనగామ జిల్లా, యువ వెలుగు, అక్టోబర్ 1 :** దేవరుప్పుల మండలం,కామారెడ్డి గూడెం గ్రామంలోని పాలకేంద్రం ఆవరణలో విజయ పాల ఉత్పత్తి దారుల సహకార సంఘం సభ్యులందరూ కలిసి సమావేశాన్ని ఏర్పాటు చేసుకున్నారు. ఈ సమావేశంలో ప్రస్తుత అధ్యక్షుడు పంగ శ్రీనివాస్ నిలబడి నేను పాడి రైతులకు ఇచ్చే బోనస్ ఇవ్వలేక పోతున్నానని,కావున అనివార్య కారణాల వల్ల నేను నా పదవికి న్యాయం చేయలేక పోతున్నానని,కావున నేను స్వచ్ఛందగా నా పదవికి రాజీనామా చేస్తున్నానని,తిరిగి మీరు కొత్త అధ్యక్షుడిని ఎన్నోకోగలరని తెలిపారు.అందుకు సభ్యులందరూ కలిసి పాత అధ్యక్షుడు మహ్మద్ గులాం రసూల్ ని మళ్ళీ ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ లు యాదయ్య, యాదవరెడ్డి, సతీష్,చంద్రయ్య, లక్ష్మయ్య,మణెమ్మ, జోజమ్మ,భాస్కర్, శ్రవణ్,ప్రభాకర్ రెడ్డి, చంద్రా రెడ్డి,అంజయ్య, ఆనంద్ కుమార్,పాల ఉత్పత్తి దారులు,తదితరులు పాల్గొన్నారు.

## శుక్రవారం చింతకాని-జగన్నాధపురం రోడ్డుపై గుంతలు ప్రమాదాలకు ఆహ్వానం

**మరమ్మతులు చేపట్టి ప్రమాదాలు నివారించాలని వాహనదారుల విజ్ఞప్తి**



**చింతకాని, యువ వెలుగు, అక్టోబర్ 1 :** చింతకాని నుంచి జగన్నాధపురం వెళ్లే ప్రధాన రహదారిపై పలుచోట్ల గుంతలు ఏర్పడి రోడ్డు అధ్వానంగా మారింది. ముఖ్యంగా రహదారి మధ్యలో ఏర్పడిన గుంతల కారణంగా వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ద్విచక్ర వాహనదారులు గుంతలను తప్పించుకునే క్రమంలో ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వర్షాల కారణంగా గుంతలు మరింత పెద్దవిగా మారడంతో రాత్రి వేళల్లో పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారుతోందని వాహనదారులు చెబుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి రహదారిపై ఏర్పడిన గుంతలను వెంటనే పూడ్చి, అవసరమైన మరమ్మతులు చేపట్టి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## సిబ్బంది సేవలు అభినందనీయం

**అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లకు సన్మానం**



**చేవెళ్ల, యువ వెలుగు, అక్టోబర్ 1 :** సేవా సంకల్ప్ అభియాన్‌లో భాగంగా చేవెళ్ల మున్సిపల్ పరిధిలోని రామన్నగూడ వార్డు అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లను కౌన్సిలర్ పెద్దోళ్ల దయాకర్ శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, చిన్నారుల సంరక్షణతోపాటు వారికి పౌష్టికాహారం అందించడంలో అంగన్‌వాడీ, ఆశా సిబ్బంది అందిస్తున్న సేవలు అభినందనీయమన్నారు. సమాజ ఆరోగ్య పరిరక్షణలో వారి పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు.

## లంచం వలలో ఇద్దరు అధికారులు

**రూ.75 వేలు తీసుకుంటుండగా ఏసీబీకి చిక్కిన టౌన్ ప్లానింగ్ అధికారి, సీనియర్ అసిస్టెంట్**

**నిర్మాణంపై చర్యలు లేకుండా చూసేందుకు డబ్బులు డిమాండ్ చేసినట్లు ఆరోపణ.. నగదు స్వాధీనం**



**చేవెళ్ల, యువ వెలుగు, అక్టోబర్ 1 :** మొయినాబాద్ మున్సిపాలిటీలో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు బుధవారం నిర్వహించిన ట్రాప్‌లో ఇద్దరు అధికారులు పట్టుబడ్డారు. టౌన్ ప్లానింగ్ అధికారి గుండు వాణి (AO–1), సీనియర్ అసిస్టెంట్ యలమోని సుదర్శన్ (AO–2) రూ.75 వేల లంచం తీసుకుంటుండగా ఏసీబీ డీఎస్పీ శ్రీధర్ ఆధ్వర్యంలోని అధికారులు పట్టుకున్నట్లు తెలిపారు.ఏసీబీ వివరాల ప్రకారం.. ఫిర్యాదుదారుడి నిర్మాణాన్ని చట్టవిరుద్ధమైనదిగా పరిగణించి, ఎలాంటి బలవంతపు చర్యలు తీసుకోకుండా అధికారిక సహాయం చేస్తానని టౌన్ ప్లానింగ్ అధికారి చెప్పినట్లు పేర్కొంది. ఇందుకు సీనియర్ అసిస్టెంట్ ద్వారా ఫిర్యాదుదారుడి నుంచి రూ.75 వేల లంచం డిమాండ్ చేసినట్లు తెలిపింది.సెప్టెంబరు 30న లంచం సొమ్మును స్వీకరిస్తుండగా ఏసీబీ సిటీ రేంజ్–2 అధికారులు ట్రాప్ నిర్వహించారు. సీనియర్ అసిస్టెంట్ సూచన మేరకు అతని వద్ద నుంచి రూ.75 వేల నగదును స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. ఇద్దరు అధికారులు విధులను సక్రమంగా నిర్వహించకుండా అక్రమ ప్రయోజనం పొందేందుకు వ్యవహరించినట్లు ఏసీబీ పేర్కొంది.ఇద్దరు నిందితులను నాంపల్లిలోని SPE & ACB కేసుల మొదటి అదనపు ప్రత్యేక న్యాయస్థానంలో హాజరుపరుస్తున్నట్లు అధికారులు తెలిపారు. కేసు దర్యాప్తు కొనసాగుతోందన్నారు. ఫిర్యాదుదారుడి భద్రత దృష్ట్యా ఆయన పేరు, ఇతర వివరాలను గోప్యంగా ఉంచినట్లు తెలిపారు.ప్రభుత్వ అధికారి ఎవరైనా లంచం డిమాండ్ చేస్తే ఏసీబీ టోల్‌ఫ్రీ నంబర్ 1064కు సమాచారం ఇవ్వాలని అధికారులు సూచించారు. వాట్సాప్ 9440446106 ద్వారా కూడా ఏసీబీని సంప్రదించవచ్చని తెలిపారు. ఫిర్యాదుదారుల వివరాలను గోప్యంగా ఉంచుతామని స్పష్టం చేశారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియను వేగవంతం చేయాలి

**గాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటర్ల నమోదుపై విస్తృత అవగాహన కల్పించాలి**



**జోగులాంబ గద్వాల జిల్లా , యువ వెలుగు, అక్టోబర్ 1 :** ఎస్ఐ ఆర్–2026,గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు ప్రక్రియలకు రాజకీయ పార్టీలు పూర్తి సహకారం అందించాలిగ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటర్ల నమోదుపై విస్తృతంగా అవగా హన కల్పించి,అర్హులైన ప్రతి పట్టభద్రుడు ఫారం–18 ద్వారా దరఖాస్తు చేసుకునేలా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అధికారులను ఆదే శించారు. గురువారం ఐడీఓసీ కాన్ఫరెన్స్ హాల్ ఎస్ఐఆర్, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు పై అధికారులు మరి యు రాజకీయ పార్టీల ప్రతిని ధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎస్ఐఆర్‌లో భాగం గా1,49,282 నోటీసులు జారీ చేసి,వాటి పంపిణీ,విచారణ ప్రక్రియను పూర్తి చేసినట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ఇప్పటి వరకు 1,32,459 విచారణలు పూర్తయ్యాయని, సంబంధిత ఆధారాలను తహ సీల్దార్ల లాగిన్‌లో అప్‌లోడ్ చేసినట్లు తెలిపారు.పెండింగ్‌లో ఉన్న విచారణలను ప్రాధాన్య క్రమంలో త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. అర్హతకు సంబంధించిన పత్రాల ను క్షుణ్ణంగా పరిశీలించి, సంబం ధిత వివరాలను ఆన్‌లైన్‌లో ఎలాంటి తప్పులు లేకుండా అప్‌లోడ్ చేయాలని ఆదేశిం చారు. అనర్హులు,ఇతర ప్రాంతాలకు తరలిపోయిన వారు,మరణించిన ఓటర్లకు సంబంధించిన వివరాలను నిబంధనల ప్రకారం పరిశీ లించి,తదుపరి చర్యలు చేపట్టాలని సూచించారు.

**గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరు నమోదుపై ప్రత్యేక దృష్టి**

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటర్ల నమోదుకు అర్హులైన పట్టభ ద్రులు ఫారం–18 ద్వారా దరఖాస్తు చేసుకునేలా మండల స్థాయిలో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ఆదేశించారు.తహసీల్దార్లను డిజిగ్నేటెడ్ అధికారులుగా నియమించిన నేపథ్యంలో సంబంధిత కార్యాలయాల్లో దరఖాస్తులను స్వీకరించి, నిబంధనల ప్రకారం పరిశీలన చేపట్టాలని తెలిపారు.అర్హత కలిగిన పట్టభద్రులు తమ ఒరిజినల్ డిగ్రీ ధ్రువపత్రాన్ని పరిశీలనకు సమర్పించేలా అవగాహన కల్పించాలని, ధ్రువపత్రాల పరిశీలన అనంతరం నిబంధనల ప్రకారం ధ్రువీకరణ ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. పత్రాల పరిశీలనలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా అధికారులుఅప్ర మత్తంగావ్యవహరించాలన్నారు.జిల్లాలోని డిగ్రీ కళాశాల లు,విద్యాసంస్థలు,ఉపాధ్యాయ సంఘా లు,ఇతర సంబంధిత వర్గాలతో సమావేశాలు నిర్వహించి గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్రక్రియపై అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచిం చారు.అర్హత కలిగిన ప్రతి పట్టభద్రుడికి సమాచారం చేరేలా మండల స్థాయి నుంచి కళాశాల స్థాయి వరకు విస్తృత ప్రచారం నిర్వహించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఆర్డీఓ శ్రీనివాస రావు,ఏఓ మంజుల, రాజకీయ పార్టీప్రతినిధులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## చండూరులో దేవీ నవరాత్రి ఉత్సవాల భూమి పూజ

**పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కోడి శ్రీనివాసులు**






**చండూరు, యువ వెలుగు, అక్టోబర్ 1 :** చండూరు మున్సిపాలిటీ పరిధిలోని కస్తాల ఎక్స్‌రోడ్ వద్ద రాబోయే శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా దేవీ నవరాత్రి ఉత్సవ మండప నిర్మాణానికి గురువారం అత్యంత వైభవంగా, శాస్త్రోక్తంగా భూమి పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చండూరు మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కోడి శ్రీనివాసులు ముఖ్య అతిథిగా హాజరై, వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ శోభాయమానంగా పూజా కార్యక్రమాలు నిర్వహించి మండప నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ, ఏటా కస్తాల ఎక్స్‌రోడ్ వద్ద స్థానికుల సహకారంతో నవరాత్రి ఉత్సవాలను ఎంతో భక్తిశ్రద్ధలతో నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ సంవత్సరం కూడా ఉత్సవాలు సర్వాంగ సుందరంగా విజయవంతం కావాలని, పట్టణ ప్రజలపై జగన్మాత ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండి అందరూ ఆయురారోగ్య అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఈ పూజా కార్యక్రమంలో వైస్ చైర్మన్ భూతరాజు దశరథ, ఉత్సవ కమిటీ సభ్యులు, వేద పండితులు మరియు పెద్ద సంఖ్యలో స్థానిక భక్తులు పాల్గొన్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు కమిటీ సభ్యులు పూర్తి ఏర్పాట్లు చేస్తున్నారు.

## ఘనంగా అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవ వేడుకలు

- **పాల్గొన్న ఏఎంసీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి**
- **పలువురు వృద్ధులకు అధికారులతో కలిసి సత్కారం**

**ఆదిలాబాద్, యువ వెలుగు, అక్టోబర్ 1 :** మహిళా, శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ, ఆదిలాబాద్ జిల్లా ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో 'అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం – 2026' కార్యక్రమం గురువారం అత్యంత ఘనంగా నిర్వహించారు. జిల్లా కలెక్టర్ రాజర్షి షా, మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూష సతీష్, ఐఔఉ మిల్కాతో కలిసి ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా వయోవృద్ధుల సంఘం ఆధ్వర్యంలో ఘనంగా వయోవృద్ధులను సత్కరించడంతో పాటు, సమాజ సేవలో అంకితభావంతో ముందుకు సాగుతున్న ఆదిలాబాద్ ఏఎంసీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డిని సంఘం నాయకులు, వయోవృద్ధులు శాలువా కప్పి, ఘనంగా సన్మానించి తమ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, సంఘం అధ్యక్షులు దేవిదాస్ దేశ్‌పాండే, జనరల్ సెక్రటరీ రామ్‌కులకర్ణి, ఆర్గనైజేషన్ సెక్రటరీ శేషికాంత్, కె. లక్ష్మా రెడ్డి, సీనియర్ ప్రతినిధులు సుధాకర్, కె. శివ్వన్న, ఎం. గంగాధర్, సి. లక్ష్మా రెడ్డి తదితరులతో పాటు వయోవృద్ధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# జిల్లాలో ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

**ఈ నెల నుంచి 17 వరకు ఓపెన్ టెన్త్, ఇంటర్ పబ్లిక్ పరీక్షలు**

**రెండు పరీక్షా కేంద్రాల్లో ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షలు**



**జోగులాంబ గద్వాల జిల్లా, యువ వెలుగు, అక్టోబర్ 1 :** జిల్లాలో ఈ నెల 11 నుంచి 17వ తేదీ వరకు ఓపెన్ పది, ఇంటర్మీడియెట్ పరీక్షలు నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ తెలిపారు.గురువారం ఐడీఓసీ తమ ఛాంబర్ నందు తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ (టాస్ ) ఆధ్వర్యంలో నిర్వహించే పదో తరగతి, ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల నిర్వహణపై ఆయా శాఖల అధికారులతో వెబ్‌ఎక్స్ ద్వారా సమన్వయ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఓపెన్ టెన్త్ మరియు ఇంటర్ పరీక్షలు ప్రశాంత వాతావరణంలో, ఎలాంటి ఇబ్బందు లు లేకుండా సజావుగా జరిగేలా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేపట్టాలని సూచించారు. జిల్లాలో ఈ నెల 11 నుంచి 17వ తేదీ వరకు ఓపెన్ పది, ఇంటర్మీడియెట్ పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్షలను ప్రతిరోజూ రెండు సెషన్లలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.ఉదయం 9:00 గంటల నుంచి మధ్యాహ్నం 12:00 గంటల వరకు పదో తరగతి పరీక్షలు, మధ్యాహ్నం 2:30 గంటల నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు ఇంటర్మీడియట్ పరీక్షలు జరుగుతాయని తెలిపారు.పదో తరగతి పరీక్షలకు 43 మంది, ఇంటర్మీడియట్ పరీక్షలకు 176 మంది విద్యార్థులు హాజరుకానున్నట్లు కలెక్టర్ తెలిపారు.పదో తరగతి పరీక్షలకు గద్వాల ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, ఇంటర్మీడియట్ పరీక్షలకు గద్వాల ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలను పరీక్షా కేంద్రాలుగా ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. పరీక్షలను నిష్పాక్షికంగా నిర్వహించేందుకు 2 చీఫ్ సూపరిడెంట్స్, 2 డిపార్టుమెంటల్ ఆఫీసర్స్, ఇన్విజిలేటర్స్ 10 మందిని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పోలీస్ స్టేషన్ నుండి పరీక్షా కేంద్రాలకు ప్రశ్నాపత్రాల రవాణా,పరీక్ష అనంతరం సమాధానపత్రాల బండిల్స్‌ను పోస్టాఫీసులకు తరలింపు భద్రంగా జరిగేలా బందోబస్తు ఏర్పాటు చేయాలాని పోలీస్ అధికారులకు ఆదేశించారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్‌ను అమలు చేసి,మాల్ ప్రాక్టీసులను నిరోధించేందుకు సమీపంలోని జిరాక్స్ కేంద్రాలను మూసివేయించాలని ఆర్డీఓ కు ఆదేశించారు.విద్యార్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకునేలా అవసరమైన మార్గాల్లో బస్సు సర్వీసులు నడిపేలా ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. పరీక్షా కేంద్రాల వద్ద ఫస్ట్ ఎయిడ్ కిట్లు, ఓఆర్ఎస్, తగినమందులతోఆశాలను,ఎ.యన్.యంలను అందుబాటులో ఉంచాలని డీ.ఎమ్.హెచ్.ఓ కు సూచించారు. పరీక్షా సమయంలో ఎటువంటి విద్యుత్ అంతరాయం లేకుండా విద్యుత్ శాఖ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ నెల 23 నుండి 30 వరకు నిర్వహించే ప్రాక్టికల్ పరీక్షలను గద్వాల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సజావుగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారిని ఆదేశిం చారు.పరీక్షల సమయంలో జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో 24 గంటల కంట్రోల్ రూమ్ అందుబాటులో ఉంటుందని తెలిపారు. పరీక్షలకు సంబంధించిన సమస్యలు, సందేహాల కోసం 8008133370 నంబర్‌కు సంప్రదించాలని సూచించారు.ఈ సమావేశంలో ఆర్డీఓ శ్రీనివాస రావు,డిఎస్పీ మొగలయ్య, విద్యాశాఖ అధికారి విజయలక్ష్మి, టాస్ కో ఆర్డినేటర్ సునీత, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుడి డిప్యూటేషన్ రద్దు చేయాలని డీఈఓకు వినతి



**హత్నూర, యువ వెలుగు, అక్టోబర్ 1 :** మండల పరిధిలోని గుండ్ల మాచునూర్ ప్రాథమికోన్నత పాఠశాలకు చెందిన ఉపాధ్యాయుడు అజ్మత్ అలీ డిప్యూటేషన్‌ను రద్దు చేసి, తిరిగి స్థానిక పాఠశాలలోనే విధులు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ గ్రామ సర్పంచ్ శ్రీహరి, ఉప సర్పంచ్ శంకర్ గురువారం జిల్లా విద్యాధికారి రోహిణిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గుండ్ల మాచునూర్ యూపీఎస్ పాఠశాలలో ఇప్పటికే విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా, సబ్జెక్టులకు సరిపడా ఉపాధ్యాయులు లేక విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఇటువంటి పరిస్థితుల్లో పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులను డిప్యూటేషన్ పేరుతో ఇతర ప్రాంతాలకు పంపించడం వల్ల విద్యార్థుల చదువుపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఉపాధ్యాయులను తరచూ డిప్యూటేషన్‌పై ఇతర పాఠశాలలకు పంపిస్తూ ఉంటే స్థానిక పాఠశాలలో విద్యాబోధనకు ఇబ్బందులు ఏర్పడతాయని, ముఖ్యంగా విద్యార్థులు నష్టపోయే పరిస్థితి నెలకొంటుందని వారు డీఈఓ దృష్టికి తీసుకెళ్లారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ఉపాధ్యాయుడు అజ్మత్ అలీ డిప్యూటేషన్‌ను వెంటనే రద్దు చేసి, తిరిగి గుండ్ల మాచునూర్ పాఠశాలలోనే విధులు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

# అక్టోబర్ 14న చలో హైదరాబాద్

**ఆదివాసీల ఆత్మఘోష మహాధర్నాను విజయవంతం చేయాలని నాయకుల పిలుపు**

**ప్రింట్ మీడియా ప్రెస్‌క్లబ్‌లో కరపత్రాల విడుదల**




**ఆదిలాబాద్, యువ వెలుగు, అక్టోబర్ 1 :** ఈనెల 14న ఇందిరా పార్క్ వద్ద నిర్వహించనున్న ఆదివాసి ఆత్మఘోష కార్యక్రమంలో భాగంగా తలపెట్టిన చలో హైదరాబాద్ కరపత్రాలను ఆదివాసి సంఘాల జేఏసీ నాయకులు గురువారం విడుదల చేశారు స్థానిక ప్రింట్ మీడియా ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అక్టోబర్ 14న హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద నిర్వహించనున్న ఆదివాసీల ఆత్మఘోష మహాధర్నా" కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్బంగా రమణాల లక్ష్మయ్య, తుడుం దెబ్బ జాతీయ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ, అక్టోబర్ 14, 2026న నిర్వహించనున్న చలో హైదరాబాద్ – ఆదివాసీల ఆత్మఘోష మహాధర్నా కార్య క్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. ఈ మహాధర్నాలో ప్రధానంగా నాలుగు డిమాండ్లపై ప్రభుత్వాన్ని కోరుతున్నట్లు తెలిపారు.ఇందులో1. 1/70 చట్టంపై గిరిజనేతరులు సుప్రీంకోర్టులో దాఖలు చేసిన కేసుపై ప్రభుత్వం వెంటనే ఆదివాసీల పక్షాన కౌంటర్ పిటిషన్ దాఖలు చేయాలన్నారు.

2.లంబాడాలను ఎస్టీ జాబితా నుండి తొలగించేందుకు వెంటనే ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేయాలని,

3.జీవో నెంబర్ 3 స్థానంలో కొత్త జీవో తీసుకురావడానికి ఆదివాసీ ఎమ్మెల్యేలు ట్రైబల్ అడ్వైజరీ కౌన్సిల్‌లో తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు.

4.రిజర్వ్ ఫారెస్ట్‌లో ఆదివాసీలు సాగు చేస్తున్న ఎనిమిది లక్షల ఎకరాల పోడు భూములకు పట్టాలు ఇవ్వాలన్నారు.

అక్టోబర్ 14న హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద నిర్వహించనున్న ఆదివాసీల ఆత్మఘోష మహాధర్నా కార్యక్రమాన్ని విజయ వంతం చేయడానికి ఆదిలాబాద్ నుండి ఉమ్మడి ఖమ్మం జిల్లా వరకు ఉన్న ఆదివాసీ ఉద్యోగులు, మహిళలు,విద్యార్థులు, ఆదివాసీ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆదివాసీ సంఘాల జేఏసీ, తుడుం దెబ్బ ఆధ్వర్యంలో పిలుపునిచ్చారు. తుడుం దెబ్బ రాష్ట్ర అధ్యక్షులు గోడం గణేష్, తుడుం దెబ్బ జాతీయ కార్యదర్శి పొదేం కృష్ణ ప్రసాద్,తుడుం దెబ్బ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వట్టం కన్నయ్య, తుడుం దెబ్బ రాష్ట్ర కార్యదర్శి అర్కా శేషరావు, ఆదివాసీ మహిళా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోడం రేణుక, ఆదివాసీ మహిళా సంఘం రాష్ట్ర కార్యదర్శి ఉయిక ఇందిర, తుడుం దెబ్బ ఆదిలాబాద్ జిల్లా డివిజన్ అధ్యక్షులు ఆత్రం ఘనపతి తదితరులు ఉన్నారు.

# మహిళలు, బాలికల భద్రతకు షీ టీమ్‌ల నిరంతర నిఘా

### జిల్లా ఎస్పీ డి.వి.శ్రీనివాసరావు ఐపీఎస్




**మెదక్ జిల్లా ప్రతినిధి, యువ వెలుగు, అక్టోబర్ 1 :** మెదక్ జిల్లాలో మహిళలు, బాలికల భద్రతకు షీ టీమ్‌లు నిరంతరం నిఘా కొనసాగిస్తున్నాయని జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు ఐపీఎస్ తెలిపారు. సెప్టెంబర్ నెలలో ఈవ్‌టీజింగ్, మహిళలను వేధించే వారిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి 64 మందిని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నామని, 67 మందికి కౌన్సెలింగ్ నిర్వహించామని వెల్లడించారు. ఈ చర్యల్లో భాగంగా 4 ఈ–పెట్టి కేసులు నమోదు చేసినట్లు ఎస్పీ తెలిపారు.జిల్లావ్యాప్తంగా పాఠశాలలు, కళాశాలలు, బస్టాండ్లు, రద్దీగా ఉండే ప్రాంతాల్లో మహిళలు, బాలికల భద్రత, ఈవ్‌టీజింగ్ నివారణ, సైబర్ నేరాలపై 44 అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. మహిళలు, బాలికలు ఎలాంటి వేధింపులకు గురైనా భయపడకుండా వెంటనే పోలీసులను ఆశ్రయించాలని సూచించారు.మహిళలు, బాలికల భద్రత విషయంలో పోలీసులు మరింత అప్రమత్తంగా పనిచేస్తారని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ స్పష్టం చేశారు.

# భూపాలపల్లి వైద్యశాఖలో 33 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్



**(భూపాలపల్లి/పలిమెల, యువ వెలుగు, అక్టోబర్ 1 :** జాతీయ ఆరోగ్య మిషన్ (NHM) కింద జయశంకర్ భూపాలపల్లి జిల్లా వైద్య, ఆరోగ్య శాఖలో ఖాళీగా ఉన్న 33 వివిధ రకాల పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డిఎం అండ్ హెచ్‌ఓ డాక్టర్ సి.హెచ్. మధుసూదన్ తెలిపారు.

**పోస్టుల వివరాలు:** మొత్తం 33 పోస్టులలో MLHP–12, స్టాఫ్ నర్స్–09, ల్యాబ్ టెక్నీషియన్–04, సెకండ్ ANM–03, పీడియాట్రిషియన్–01, జనరల్ ఫిజీషియన్–01, STLS–01, ఎర్లీ ఇంటర్వెన్షనిస్ట్–01, డిస్ట్రిక్ట్ ప్రోగ్రామ్ కోఆర్డినేటర్–01 పోస్టులు ఉన్నాయి.

**ముఖ్యమైన వివరాలు :** దరఖాస్తు గడువులి అక్టోబర్ 3 (ఉదయం 10:30) నుండి అక్టోబర్ 13 (సాయంత్రం 5:00) వరకు.

దరఖాస్తు సమర్పించాల్సిన విలాసం F25 బ్లాక్, ఐడిఓసి, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయం, జయశంకర్ భూపాలపల్లి. అధికారిక వెబ్‌సైట్‌లి దరఖాస్తు ఫారాలు, అర్హతలు, నిబంధనల కోసం bhoopalapally.telangana.gov.inను సందర్శించగలరు. అర్హత, ఆసక్తి ఉన్న అభ్యర్థులు నోటిఫికేషన్ వివరాలను సరిచూసుకుని నిర్ణీత గడువులోగా దరఖాస్తు చేసుకోవాలని డీఎంహెచ్‌ఓ సూచించారు.

# దేశదారు అక్రమ రవాణా దారు అరెస్ట్

### జిల్లా జైలుకు తరలింపు



**ఆదిలాబాద్, యువ వెలుగు, అక్టోబర్ 1 :** మహారాష్ట్ర నుంచి ఆదిలాబాద్ జిల్లా కేంద్రానికి అక్ర మంగా కారులో దేశ దారును తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి నట్లు గురువారం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ ఆకుల శ్రీనివాస్ తెలిపారు.ఈ మేరకు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ ఆదిలాబాద్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితున్ని ప్రవేశపెట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ ఆదిలాబాద్ తోపాటు డిటిఎఫ్ ఆదిలాబాద్ వారు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించామన్నారు. కొందరు మహారాష్ట్ర నుంచి కారులో దేశదారు రవాణా చేస్తున్నారన్న ఖచ్చితమైన సమాచారం మేరకు వాహనాలు తనిఖీ నిర్వహిస్తుండగా, ఆదిలాబాద్ పట్టణంలోని వడ్డెర బస్తికి చెందిన సంపంగి వెంకటరమణ కారులో సుమారు 44 వేల రూపాయల విలువ కలిగిన 90 ఎం.ఎల్ పరిమాణంగాల 99 లీటర్ల దేశదారు మద్యం బాటిల్లను రవాణా చేస్తున్నారన్నారు.దీంతో కారుతోపాటు బోరజ్ మండలంలోని పిప్పర వాడ టోల్ ప్లాజా వద్ద ఆయనను అదుపులోకి తీసుకున్నట్లు వెల్లడించారు.సదరు వ్యక్తిపై కేసు నమోదు చేసి జైలుకు తరలించినట్లు తెలిపారు. అయితే అక్రమంగా మహారాష్ట్ర నుంచి ఆదిలాబాద్ జిల్లాకు ఎవరైనా దేశదారు రవాణా చేసినట్లయితే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన హెచ్చరించారు.

# దుర్గామాతా ఉత్సవ కమిటీ అధ్యక్షునిగా శ్రీనివాస్

**యాదాద్రి, యువ వెలుగు, అక్టోబర్ 1 :** వలిగొండ ప్రజాదర్బార్ న్యూస్: మండల కేంద్రంలో దసరా సందర్భముగా శ్రీ శివాజీ యువజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న శ్రీ దుర్గా మాత శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భముగా దుర్గా మాత ఉత్సవ నూతన కమిటీ ఎన్నుకున్నారు.అధ్యక్షునిగా బచ్చు శ్రీనివాస్,గౌరవ అధ్యక్షునిగా బొల్ల సుదర్శన్,ఉపాధ్యక్షులుగా బుంగపట్ల శ్రీను,మైసొల్ల శ్రీకాంత్,దంతురి అరుణ్,ఎమ్మె నవీన్,ప్రధాన కార్యదర్శులుగా మైసొల్ల శేఖర్,మన్నే ప్రకాష్ రెడ్డి,కోశాధికారిగా కూర వెంకటేష్,కార్యదర్శులుగా అవనగంటి శివ,గంగదారి విక్రమ్,యాట శ్రీకాంత్,నాగేల్లి పాండు మరికొంత మంది సభ్యులుగా ఎన్నుకున్నారు.

# భారత చీఫ్ ఎలక్షన్ కమిషనర్ నైతిక బాధ్యత వహిస్తూ వెంటనే రాజీనామా చేయాలి : సిపిఎం




**యాదాద్రి(బీబీనగర్), యువ వెలుగు, అక్టోబర్ 1 :** సహచర సభ్యులైన ఎన్నికల కమిషనర్ల అభిప్రాయాలను గౌరవించకుండా, అభ్యంతరాలను ఖాతరు చేయకుండా ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటున్న చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ నైతిక బాధ్యత వహిస్తూ వెంటనే రాజీనామా చేయాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కోమటిరెడ్డి చంద్రారెడ్డి డిమాండ్ చేశారు. గురువారం బ్రాహ్మణపల్లి రోడ్డు చౌరస్తాలో సిపిఎం ఆధ్వర్యంలో చీఫ్ ఎలక్షన్ కమిషనర్ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా చంద్రారెడ్డి మాట్లాడుతూ సర్ పేరుతో చేస్తున్న ఓటర్ల సవరణ అధికారంలో ఉన్న బిజెపికి అనుకూలంగా చీఫ్ ఎలక్షన్ కమిషనర్ పనిచేస్తున్నారని అన్నారు. దేశంలోని ముస్లింలు, క్రైస్తవులు, ఆదివాసీలు, పేదలను సర్ పేరుతో ఓటర్ల తొలగింపు కార్యక్రమం చేస్తున్నారని అన్నారు. బీహార్, బెంగాల్, తమిళనాడు, కర్ణాటక తదితర రాష్ట్రాల్లో జరిగిన ఎన్నికల సందర్భంగా నిరూపణ జరిగిందన్నారు. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో కూడా లక్షలాది ఓటర్లను తొలగిస్తున్న వైఖరిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. జ్ఞానేష్ కుమార్ ను అడ్డం పెట్టుకొని బిజెపి రానున్న కాలంలో దేశాన్ని హిందూ దేశంగా మార్చాలని కుట్ర చేస్తుందన్నారు. తక్షణమే చీఫ్ ఎలక్షన్ కమిషనర్ రాజీనామా చేయాలని అందుకు అన్ని రాజకీయ పార్టీలు తీవ్రమైన ఆందోళనలకు సిద్ధం కావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి బండారు శ్రీరాములు, నాయకులు దండెబోయిన శ్రీశైలం, ఆడపెల్లి జంగయ్య, తోకల రఘుపతి, పర్వత మల్లేష్, మోతే గణేష్, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

# సారపాక ఫోటోగ్రాఫర్‌కు అరుదైన గౌరవం

### నాగేంద్ర ప్రసాద్‌కు 'భరత్ కళా పురస్కార్'

### బెస్ట్ ట్రెడిషనల్ ఫోటోగ్రాఫర్ అవార్డు



**బూర్గంపహాడ్, యువ వెలుగు , అక్టోబర్ 1 :** ఫోటోగ్రఫీ రంగంలో విశేష ప్రతిభ కనబరుస్తున్న సారపాకకు చెందిన ఉదయ సాయి డిజిటల్స్ నాగేంద్ర ప్రసాద్కు ప్రతిష్టాత్మక 'భరత్ కళా పురస్కార్' లభించింది. హైదరాబాద్‌లో ఈ నెల 2, 3, 4 తేదీల్లో నిర్వహిస్తున్న ఫోటో ట్రేడ్ షోలో ఆయనకు బెస్ట్ ట్రెడిషనల్ ఫోటోగ్రాఫర్ అవార్డును అందజేయనున్నారు.సంప్రదాయ ఫోటోగ్రఫీ రంగంలో నాగేంద్ర ప్రసాద్ అందిస్తున్న సేవలు, ఆయన ప్రతిభను గుర్తించిన నిర్వాహకులు ఈ పురస్కారానికి ఎంపిక చేసినట్లు తెలిపారు. ఫోటోగ్రఫీని కేవలం వృత్తిగా కాకుండా ఒక కళగా భావిస్తూ, సంప్రదాయ విలువలను కాపాడుతూ ఆయన చేస్తున్న కృషికి ఈ అవార్డు గుర్తింపుగా నిలిచింది.సారపాక ప్రాంతానికి చెందిన ఫోటోగ్రాఫర్‌కు ప్రతిష్టాత్మక పురస్కారం లభించడం పట్ల స్థానికులు, ఫోటోగ్రఫీ రంగానికి చెందిన మిత్రులు, శ్రేయోభిలాషులు హర్షం వ్యక్తం చేశారు. నాగేంద్ర ప్రసాద్ మరిన్ని ఉన్నత పురస్కారాలు అందుకోవాలని ఆకాంక్షిస్తూ పలువురు అభినందనలు తెలిపారు.

## నాలుగు బంగారు పతకాలతో

# మేఘన కాంతిప్రియ ప్రతిభా

### - హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ స్నాతకోత్సవంలో అరుదైన ఘనత



**బూర్గంపహాడ్, యువ వెలుగు, అక్టోబర్ 1 :** విద్యారంగంలో ప్రతిభ కనబరుస్తూ మొరంపల్లి బంజరకు చెందిన తాతిరెడ్డి మేఘన కాంతిప్రియ అరుదైన ఘనత సాధించారు. సారపాక వాసి అయిన ఆమె హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో ఆంత్రోపాలజీలో మాస్టర్స్ డిగ్రీ పూర్తి చేసిన ఆమె 2026 స్నాతకోత్సవంలో ఒకేసారి నాలుగు బంగారు పతకాలను అందుకున్నారు. పీజీ స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి టాపర్‌గా నిలిచినందుకు యూనివర్సిటీ పీజీ టాపర్ మెడల్తో పాటు ప్రొఫెసర్ ఎల్.కె. మూర్తి మెడల్–ఫిజికల్ అండ్ ఆర్కియాలాజికల్ ఆంత్రోపాలజీ, అలుమ్ని మెడల్ ఫర్ సోషల్ ఆంత్రోపాలజీ, లేట్ నంపల్లి అశోక్ కుమార్ మెడల్–ఫీల్డ్‌వర్క్ డిసర్టేషన్స్ ఆమెకు లభించాయి.మాస్టర్స్ విద్యాభ్యాసంలో భాగంగా మేఘన కాంతిప్రియ 'ఎడ్యుకేషన్ అండ్ ఇంటర్‌జెనరేషనల్ చేంజెస్' అనే అంశంపై పరిశోధన చేశారు. విద్య, సమాజం, తరాల మధ్య చోటుచేసుకుంటున్న మార్పులను క్షేత్రస్థాయి అధ్యయనం ద్వారా పరిశీలిస్తూ ఆమె పరిశోధన కొనసాగించారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో నిర్వహించిన స్నాతకోత్సవ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా, యూనివర్సిటీ వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ అనురాధ, స్నాతకోత్సవ ముఖ్య అతిథి, డీఆర్‌డీఓ మాజీ డైరెక్టర్ డాక్టర్ సమీర్ వి. కామత్ తదితరుల సమక్షంలో మేఘన కాంతిప్రియ ఈ పతకాలను అందుకున్నారు.మొరంపల్లి బంజరకు చెందిన తాతిరెడ్డి ధనలక్ష్మి–గోవిందరెడ్డి దంపతుల కుమార్తె అయిన మేఘన కాంతిప్రియ కుటుంబం ప్రస్తుతం సారపాకలో నివాసం ఉంటోంది. ఒకేసారి నాలుగు బంగారు పతకాలు సాధించడంతో కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్తులు, శ్రేయోభిలాషులు ఆమెను అభినందించారు. ఇదిలా ఉండగా, మేఘన కాంతిప్రియ ప్రస్తుతం హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలోనే పీహెచ్‌డీ అభ్యసిస్తున్నారు. ఆటిజం స్పెక్ట్రమ్ డిజార్డర్‌తో ఉన్న పిల్లలు, వారి తల్లిదండ్రులు ఎదుర్కొంటున్న సామాజిక, విద్యా, కుటుంబపరమైన సవాళ్లపై ఆమె పరిశోధన చేస్తున్నారు.తల్లిదండ్రులు, గురువుల నుంచి నేర్చుకున్న విలువలు, నైతికతతో పాటు తాను అభ్యసించిన విద్యను సమాజ శ్రేయస్సుకు వినియోగించడమే తన ప్రధాన లక్ష్యమని తెలిపారు.

# ప్రభుత్వ దావఖానాలలో నాణ్యమైన వైద్యాన్ని అందించాలి..!

### మీర్జాపూర్ పీహెచ్‌సికి అంబులెన్స్ కేటాయించండి

### పొన్నబోయిన శ్రీనివాస్ బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు




**హుస్నాబాద్, యువ వెలుగు , అక్టోబర్ 1 :** పేద ప్రజలకు ఉచిత వైద్యం అందించాలనే ఉద్దేశ్యం తో ప్రభుత్వాలు ప్రభుత్వ ఆసుపత్రులు నిర్మాణాలు చేపట్టి ప్రజలకు వైద్యం అందించడం జరుగుతుంది ఈ క్రమంలో మీర్జాపూర్ లో నిర్మించినటువంటి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోజుకు దాదాపు 50 నుండి 60 మంది వరకు వైద్యం చేయించుకునుటకు హుస్నాబాద్,అక్కన్నపేట మరియు వివిధ మండలాల నుండి వస్తున్నారు ఇక్కడికి వచ్చే రోగులకు రవాణా సౌకర్యం లేక ప్రైవేట్ వాహనాల్లో వస్తున్నారని బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు పొన్న బోయిన శ్రీనివాస్ అన్నారు. అలాగే ఆసుపత్రికి వచ్చిన వారు మెరుగైన వైద్యం కోసం పట్టణ ప్రాంతాలకు వెళ్లాలంటే హన్మకొండ, సిద్దిపేట, కరీంనగర్, జనగాం ఎటు చూసినా 40 కిలోమీటర్ల దూరం ఉంది కాబట్టి వైద్యం చేయించుకునే వారికి అంబులెన్స్ లేక చాలా ఇబ్బందులు పడాల్సి వస్తుంది కాబట్టి హుస్నాబాద్ ఎమ్మెల్యే , మంత్రి పొన్నం ప్రభాకర్ స్పందించి మీర్జాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెంటనే అంబులెన్స్ కేటాయించాలని విజ్ఞప్తి చేశారు.

# వైద్య సంస్థల్లో భద్రతా నిబంధనలు కచ్చితంగా అమలు చేయాలి

### - రోగుల భద్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలి : జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్



**మెదక్ జిల్లా ప్రతినిధి, యువ వెలుగు, అక్టోబర్ 1 :** జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులు, వైద్య సంస్థలు వైద్య సంస్థల చట్టం నిబంధనలను కచ్చితంగా అమలు చేసేలా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ క్యాంప్ ఆఫీస్ నుంచి గూగుల్ మీట్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ. ఆసుపత్రుల్లో రోగుల భద్రతకు అత్యధిక ప్రాధాన్యతనిస్తూ, అగ్ని ప్రమాదాలు, విద్యుత్ ప్రమాదాలు తదితర అవాంఛనీయ ఘటనలకు ఆస్కారం లేకుండా ముందస్తు భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు. వైద్య సంస్థల చట్టం అమలు, అగ్ని ప్రమాదాల నివారణ, రోగులను భద్రత ఉంచాలన్నారు. నివాస అవసరాల కోసం నిర్మించిన భవనాల్లో నిర్వహిస్తున్న ఆసుపత్రులను ప్రత్యేకంగా పరిశీలించి, ఆసుపత్రుల నిర్వహణకు అవసరమైన భద్రతా ప్రమాణాలు, అగ్ని ప్రమాదాల నివారణ ఏర్పాట్లు, అత్యవసర సేవలు, విద్యుత్ భద్రత తదితర సదుపాయాలు నిబంధనల మేరకు ఉన్నాయా లేదా నిర్ధారించాలని ఆదేశించారు. అత్యవసర పరిస్థితుల్లో రోగులు, వారి బంధువులు, ఆసుపత్రి సిబ్బందిని తక్షణమే సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు తగిన ఏర్పాట్లు తప్పనిసరిగా ఉండాలని స్పష్టం చేశారు. ముఖ్యంగా అగ్ని ప్రమాద సమయంలో పొగ వ్యాప్తి వల్ల ప్రమాద తీవ్రత పెరిగే అవకాశం ఉన్నందున, ప్రత్యామ్నాయ మార్గాలు, అత్యవసర మెట్ల మార్గాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి ఆసుపత్రిలో అగ్ని మాపక పరికరాలు, హెచ్చరిక వ్యవస్థలు, విద్యుత్ భద్రతా ఏర్పాట్లు తదితరాలను క్రమం తప్పకుండా తనిఖీ చేయాలని, లోపాలు గుర్తించిన వెంటనే సరిచేయించాలని ఆదేశించారు. ఆసుపత్రి సిబ్బందికి అత్యవసర పరిస్థితుల్లో రోగులను సురక్షితంగా తరలించే విధానంపై క్రమం తప్పకుండా శిక్షణ అందించాలని సూచించారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులు, వైద్య సంస్థలను సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో తనిఖీ చేసి, నిబంధనల అమలుపై సమగ్ర నివేదిక సమర్పించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. రోగుల ప్రాణ భద్రత విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్లక్ష్యానికి తావు లేకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి జ్ఞానేశ్వర్, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# వృద్ధుల అనుభవమే సమాజానికి మార్గదర్శకం :అదనపు కలెక్టర్ సంపత్‌రావు




**ములుగు, యువ వెలుగు, అక్టోబర్ 1 :** వృద్ధుల అనుభవం, జ్ఞానం సమాజానికి మార్గదర్శకమని జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు అన్నారు. అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం –2026ను పురస్కరించుకొని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, దివ్యాంగులు, వయోవృద్ధులు, ట్రాన్స్‌జెండర్ల సాధికారత శాఖ ఆధ్వర్యంలో గురువారం జిల్లా కార్యాలయాల సముదాయంలో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వయస్సు శరీరానికేనని, మనసుకు సంబంధం లేదని, ప్రభుత్వం ప్రత్యేక చట్టాలతో సంక్షేమ పాలన అందిస్తోందని, వృద్ధులు డే కేర్ సెంటర్ ను సద్వినియోగం చేసుకోవాలని, ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు.కుటుంబ వ్యవస్థకు వృద్ధులే పునాదులని మున్సిపల్ చైర్ పర్సన్ చింతనిప్పుల చంద్రకళ, తల్లిదండ్రులను సేవించడమే గొప్ప పూజని, వృద్ధులు ఒంటరితనానికి గురికాకుండా చూడాలని వైస్ చైర్ పర్సన్ ఆసియా షాహిన్ అన్నారు.అనంతరం వృద్ధుల సంక్షేమ ప్రతిజ్ఞ చేసి, సన్మానించి, క్రీడల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీఏ అధికారి రవీందర్, బీడబ్ల్యూఓ ప్రేమలత, ఏపీడీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల హక్కుల కోసం నేడు నిరసనలు

**జనగామ, యువ వెలుగు, అక్టోబర్ 1 :** జర్నలిస్టుల హక్కులు, భద్రత, సామాజిక, ఆర్థిక సంక్షేమం కోసం ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ పిలుపు మేరకు నేడు గాంధీ జయంతి సందర్భంగా నిర్వహించే 'డిమాండ్ల దినోత్సవం'ను విజయవంతం చేయాలని టీయూడబ్ల్యూజే–ఐజేయూ జిల్లా అధ్యక్షుడు ఇర్రి మల్లారెడ్డి, ప్రధాన కార్యదర్శి సురిగల బిక్షపతి పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ.. కళ్యాణ్ సిల్క్ ఎదురుగా గాంధీ విగ్రహం వద్ద శాంతియుత ఆందోళన నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. జిల్లా కేంద్రంలో నిర్వహించే కార్యక్రమంలో జర్నలిస్టులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. మీడియా రంగంలో చోటుచేసుకుంటున్న మార్పులకు అనుగుణంగా నూతన మీడియా కమిషన్ ఏర్పాటు చేయాలని, జర్నలిస్టుల భద్రత కోసం ప్రత్యేక జాతీయ చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టులు, జర్నలిస్టేతర మీడియా సిబ్బందికి ప్రస్తుత జీవన వ్యయానికి అనుగుణంగా వేతనాలు కల్పించేందుకు కొత్త వేజ్ బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు.

తెలంగాణ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు, ఇళ్లు మంజూరు చేయాలని, ఉద్యోగుల తరహాలో జర్నలిస్టులకు హెల్త్ కార్డులు అందించి నగదు రహిత వైద్య చికిత్స సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ పార్నంది వెంకటస్వామి, కోశాధికారి ఓరుగంటి సంతోష్, టీయూడబ్ల్యూజే ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్షుడు కెమిడి ఉపేందర్, ప్రధాన కార్యదర్శి పసునూరి గణేష్, బొల్లు ఎల్లారెడ్డి, కొత్తపల్లి కిరణ్, వంగ శ్రీకాంత్ రెడ్డి, శేషత్వం ఆనంద్, సందేన రమేష్, జంపాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# హల్మాస్ కుంటపై హైడ్రా దృష్టి సారించాలి

### - కమిషనర్‌ను కలిసి వినతి పత్రం అందజేసిన వజ్రేష్ యాదవ్




**మేడిపల్లి, యువ వెలుగు , అక్టోబర్ 1 :** మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని చెంగిచెర్ల డివిజన్‌లో పరిదిలోని హల్మాస్ కుంట అభివృద్ధి,పరిరక్షణకు తక్షణ చర్యలు చేపట్టాలని మేడ్చల్ డీసీసీ అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్ హైడ్రా కమిషనర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ హల్మాస్ కుంట చెరువు స్థానిక ప్రజలకు కీలక జలవనరుగా ఉందన్నారు.చెరువును అభివృద్ధి చేయడంతో పాటు పరిసర ప్రాంతాలను సుందరీకరించి, కాలుష్యాన్ని నివారించే చర్యలు చేపట్టాలని కోరారు. అలాగే చెరువులో నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచి భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దాలని సూచించారు. చెరువు పరిధిలో ఆక్రమణలు, మురుగునీటి సమస్యలు ఉన్నట్లయితే వాటిని గుర్తించి పరిష్కరించాలని, చెరువును సమగ్రంగా అభివృద్ధి చేసి ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించాలని హైడ్రా అధికారులను కోరారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని హల్మాస్ కుంట చెరువు అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సింగిరెడ్డి పద్మా రెడ్డి, పుల్లకండ్ల జంగా రెడ్డి, పుల్లకండ్ల వెంకట్ రెడ్డి, పుల్లకండ్ల రాజి రెడ్డి, సింగిరెడ్డి రాజు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**Editor P. Mahesh Goud,** Rachakonda printer's & publication's, Sri balaji printing press, H.No:-5-2-396, Venkateshwara colony, saheb nagar, Rangareddy, 500070
PRGI: TGTEL /26/A6429 office address : #5-4-183, Twin city towers complex, Abids, Hyd-500001, TG. yuvavelugu@gmail.com. Contact number : **9908 502 602**